క్లుప్తంగా

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: ఉచిత ఆయుర్వేద వైద్యశాలను సదినియోగం చేసుకోవాలని వైద్యురాలు ఎం.నీరజ తెలిపారు. మండల పరిధి బూరుగుపూడిలోని జెడ్పీ పాఠశాల ఎదురుగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆమె బుధవారం తెలిపారు. శిబిరానికి వచ్చిన వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు.

బాల్య వివాహాలపై కళాజాత



లింగంపర్తిలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి లక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సాహించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ నాయకుడు భూసాల శ్రీను సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలపై, కార్మిక వర్గంపై తీవ్రమైన దాడులు చేసిందన్నారు. కార్యక్రమంలో కె.సతీష్‌కుమార్, అల్లాడి లక్ష్మి, ఎ.అన్నపూర్ణ, శాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించండి



పేరవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓ-2 వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేరవరం గ్రామంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ-2 వరలక్ష్మి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు విద్యా ప్రవేశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాభవానీ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుందరరావు, శ్రీను, సత్యవేణి పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రాన్ని దర్శించిన మాధవీ మాత



అరుణాచలేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న మాధవీ మాత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి వారి క్షేత్రాన్ని బుధవారం అరుణాచలానికి చెందిన మాధవీ మాత సందర్శించారు. మాతాజీ అరుణాల క్షేత్రంలోని ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని దేవతా మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం శ్రీరమణా దేవాలయంలో అనుగ్రహ భాషణ చేశారు. ఆమెకు దేవస్థానం పీఠాధిపతి స్వామి రామానంద అరుణాచల క్షేత్రం విశిష్టతలను వివరించారు. వారి వెంట పలువురు భక్తులు ఉన్నారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని పురస్కరించుకుని బుధవారం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లోని పలు గ్రామాల మీదుగా టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంట.. అదనపు ఆదాయం

- కోకో సాగుపై ఆసక్తి చూపిస్తున్న మెట్ట రైతులు
- ఆశాజానకంగా కోకో గింజల ధరలు
- సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వ రాయితీలు



తేటగుంటలో విరగ కాసిన కోకో కాయలు



తేటగుంటలో కోకో కొమ్మలు కత్తిరిస్తున్న కూలీ

తుని రూరల్: చిన్నారులు, యువత ఎంతో ఇష్టంగా తినే చాక్లెట్ల తయారీకి ప్రధాన ముడి సరుకుగా వినియోగించే కోకో సాగుపై మెట్ట రైతుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఒకసారి మొక్కలు నాటితే 20 నుంచి 25 ఏళ్ల పాటు ఫలసాయం లభిస్తుండడం, కోకో గింజలకు మంచి గిట్టుబాటు ధర లభించడం, ప్రభుత్వం ప్రోత్సాహకంగా రాయితీలు ఇస్తుండడంతో ఈ ఏడాది కోకో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ధర పెరగడంతో మెట్ట రైతుల ఆసక్తి

కాకినాడ జిల్లాలో తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, గండేపల్లి, ఏలేశ్వరం, కాజులూరు మండలాల్లో 353 ఎకరాల్లో కోకో సాగవుతుండగా తుని మండలంలోనే అత్యధికంగా 250 ఎకరాల్లో సాగవుతుంది. 15 ఏళ్లు పైబడిన కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకోను సాగు చేస్తుండడంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. హెక్టారు కొబ్బరి తోటలో అంతర పంటగా 500 కోకో మొక్కలను వేసుకోవొచ్చు. అదే ఆయిల్‌పామ్‌లోనైతే హెక్టారుకు 400 కోకో మొక్కలను నాటుకోవొచ్చు. మూడేళ్ల నుంచి ఒక్కొక్క మొక్క నుంచి రెండున్నర కిలోల నుంచి మూడు కిలోల వరకూ కోకో గింజల దిగుబడి లభిస్తుంది. అంతర పంటగా సాగు చేసే కోకో సాగు విస్తీర్ణం పెంపు కోసం ప్రోత్సాహకంగా ప్రభుత్వం మూడు విడతల్లో రూ.20 వేలు రాయితీ అందిస్తుంది. మొక్కలు నాటిన మూడేళ్ల నుంచి ప్రతి మొక్కకు 250 గ్రాములు యూరియా, 250 గ్రాములు ఎస్ఎస్‌పీ, 250 గ్రాములు పొటాష్ ఎరువులు వేసుకోవాలి. ఈ సంవత్సరం కోకో గింజలకు గరిష్ఠంగా కిలోకు రూ.700 ధర లభించింది. గతేడాదితో పోల్చితే ఇది 130 శాతం అధికమని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే అత్యధిక శాతం మంది రైతులు ఈ ఏడాది తమ తోటల్లో అంతర పంటగా కోకో వేసుకునేందుకు ముందుకొస్తున్నారు.

బిందు సేద్యం పరికరాలతో మేలు

ఎర్ర నేలలు, గరప నేలలు కోకో సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఏడాదికి సరాసరిన 1250 మీల్లీ లీటర్ల పైబడిన వర్షపాతం కురిసే ప్రాంతాలు ఈ పంటకు అనుకూలం. తేమతో కూడిన నేలలు, తేలికపాటి నేలల్లో సాగు చేయడం నష్టదాయకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తక్కువ వర్షపాతం గల పొడి నేలల్లో సాగు చేయాలంటే నీటి ఎద్దడి సమయంలో నీటి తడులు ఇవ్వగలిగే సామర్థ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నీటి ఎద్దడి నివారణకు విద్యుత్ బోరుబావితో బిందు సేద్యం పరికరాలను అమర్చుకుంటే ప్రయోజనంగా ఉంటుంది. అధిక దిగుబడుల కోసం కోకోలో కొమ్మల కత్తిరింపునకు జూలై నుంచి డిసెంబరు వరకు వాతావరణం అనుకూలం. ఈ నేపథ్యంలో గాలి, వెలుతురు, సూర్యరశ్మి కాండం మీద ప్రసరించేలా కోకోలో కొమ్మలను గొడుగు ఆకారంలో కత్తిరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తెగులు సోకిన, అవసరం లేని ముదర కొమ్మలు, అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించడం వల్లచెట్టు ధృడంగా పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటుందంటున్నారు.

> **దరఖాస్తులు తీసుకుంటున్నాం**
>
> 
>
> కోకో సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న రైతుల నుంచి ఆర్బీకేలో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల(వీహెచ్ఏ) ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఆసక్తి గల రైతులు వీహెచ్ఏలను సంప్రదించొచ్చు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మూడేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయి.
>
> – జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో బుధవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ఘనంగా సాహూ మహరాజ్ జయంతి

జగ్గంపేట: ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బహుజన్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్హాపూర్ రాష్ట్రాన్ని 1900–1922 మహారాజుగా పరిపాలించారని ఆయన పరిపాలనలో దళిత, బలహీన వర్గాల అసమానతలను తొలగించారన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



గోకవరంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి

గోకవరం: ఎరువులు, విత్తనాలు విక్రయించే షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లవరం, గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల షాపులను గురువారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు లాట్ నెంబరు వేసిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఓ రాజరాజేశ్వరి, వీఏఏలు, వీహెచ్ఏలు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్ సీఐ, ఎస్ఐ తదితరులు



గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది బుగతా శివ

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ అడ్వకేట్ బుగతా శివ అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్తిపాడు లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సరాఫరా చేసినా, వాడిన చట్టరీత్యా నేరమన్నారు. అసాంఘిక శక్తుల ప్రభావానికి లోను కాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అవసరాల దేవి, ప్రిన్సిపాల్ ఉషామాధురి, శ్రీలక్ష్మి, అవసరాల కిషోర్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ర్యాలీ

ప్రత్తిపాడు: ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల వద్ద ర్యాలీని సెబ్ సీఐ ఎల్.చిరంజీవి ప్రారంభించారు. ర్యాలీ మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, అంబేడ్కర్ కళామందిర్ మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ కొనసాగింది. అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీనుద్దేశించి స్థానిక ఎస్ఐ ఎం. పవన్‌కుమార్ మాట్లాడుతూ మొదట్లో సరదాగా తీసుకున్న మత్తు పదార్థాలే మనిషిని బానిసగా మారుస్తాయన్నారు. ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా, కొనుగోలు చేస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ ఎం.ఆశాలత, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గోకవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గోకవరం ఎస్ఐ కె.నాగరాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి



విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: విద్యార్థినులకు ఏ సమస్య ఉన్నా నిర్భయంగా చెప్పాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారమే భోజనం అందుతుందా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. కన్నవారికి దూరంగా ఉంటున్న విద్యార్థినులకు ఇంటిని మరిపించే రీతిలో వసతిగృహం ఉండాలని, రోగాలు దరి చేరకుండా శుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. వసతిగృహ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోర్టు లోక్‌అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, వసతిగృహ సంక్షేమాధికారి ఎం.శైలజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు



తొండంగి మండలం దానవాయిపేటలో ఎగసి పడుతున్న సముద్రపు అలలు

తొండంగి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దానవాయిపేట, అద్దరిపేట, కొత్తచోడిపల్లిపేట, యర్రయ్యపేట, వాకదారిపేటల్లో బుధవారం ఉదయం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు తోట కూర గంగాధర్ బుధవారం తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారిచే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని చెప్పారు.

30న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: ఈ నెల 30వ తేదీ సాయంత్రం రెండు మున్సిపాలిటీల పరిధిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.ప్రభాకర్, జీవీకే మోహన్‌రావు, ఎ.శివయ్య, అల్లు ప్రసాద్, కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించాల్సి ఉన్నదని, అప్పట్లో ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల వాయిదా వేశామన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు శోభాయాత్ర చేరుతుందన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న భక్తులు శోభాయాత్ర బైక్ ర్యాలీలో పాల్గొనాలని వారు పిలుపు నిచ్చారు.

సమన్వయంతో జాతరను విజయవంతం చేయండి

ఆర్డీఓ జేఎస్ రామారావు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో మరిడమ్మ తల్లి జాతరను విజయవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక మరిడమ్మ తల్లి కాలక్షేప మండపంలో వచ్చే నెల నాలుగో తేదీ నుంచి జరగనున్న జాతర ఏర్పాట్లపై బుధవారం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, ఆర్టీసీ, మున్సిపల్, వైద్యశాఖాధికారులతో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వి రామ్మోహనరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే ఇలువేల్పుగా పేరొందిన అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అసవరమన్నారు. ఆయా శాఖల సిబ్బంది తమ తమ విధుల్లో నిమగ్నమై అమ్మవారి జాతర ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆషాఢ మాసంలో నిర్వహించే జాతరలో శానిటేషన్ పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ఆర్డీఓ సమీక్షించారు. ఈఓ రామ్మోహరావు మాట్లాడుతూ నాలుగో తేదీన జాగరణ ఉత్సవం తరువాత ఐదో తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు 37 రోజుల పాటు జాగరణ ఉత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఎస్ఐ వెలుగుల సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు దాతల సహకారం అవసరం



గ్రంథాలయాధికారికి మెటీరియల్ అందజేస్తున్న రాజేష్ ఖన్నా

పెద్దాపురం: గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని స్థానిక గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త జిగిని రాజేష్ ఖన్నా పోటీ పరీక్షలకు విద్యార్థులకు అవసరమ్యే గ్రూపు 2, రైల్వే, డీఎస్సీ, గ్రూప్ 1 పుస్తకాలను బుధవారం గ్రంథాలయాధికారి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠకుల సౌకర్యార్థం మెటీరియల్ అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లియ్య, రామారావు, కొమ్మన అప్పారావు, అరవింద్, నరేంద్రకుమార్, వానపల్లి సత్యనారాయణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై అవగాహన



విద్యార్థులకు మట్టినమూనాల సేకరణ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలోని చల్లా వెంకట్రావు పద్మరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం) మట్టి నమూనాల అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం హైస్కూల్ విద్యార్థులకు ఆత్మ పీడీ జ్యోతిర్మయి, పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకురాలు మాధవి ఆధ్వర్యంలో మట్టి నమూనా తీసే వీధానం, విశ్లేషణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి భూసారాన్ని పరీక్షించడం వల్ల వ్యవసాయ అధికారులు భూమిలో లోపాలను సరిదిద్దేందుకు నేల సారం పెంచేందుకు అవసరమైన సూచనలిస్తారు. భూసారాన్ని అనుసరించే పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయి. నత్రజని, భాస్వరం, పొటాష్, ఖనిజ లవణాలు ఇతర పోషకాల విలువలు నేలలో ఎంత మేరకు ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుస్తుందని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, పెద్దాపురం వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, సుధామాధురి, మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు పూర్తి చేయాలి

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. హెచ్ఎం పి.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నీ ఉన్నా సేవలు అధ్వానం

- ప్రజాధనం లక్షలు ఖర్చవుతున్నా తాగునీరు, వీధిలైట్లు నిరుపయోగమే
- శివార్లకు నీటి సరఫరాలో విఫలం
- అధికారులపై కౌన్సిలర్ల ధ్వజం



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు: పట్టణంలో రూ.కోట్ల విలువైన మంచి నీటి పథకం ఉంది. ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చు చేస్తు తాగునీటి పథకాన్ని నిర్వహిస్తున్నా పట్టణంలో కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని, ఎక్కడా వీధిలైట్లు వెలగడం లేదని కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం నగర పంచాయితీ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరచిన 16 అంశాలను చదివి వినిపించగా నాలుగు అంశాలను నిరాకరిస్తూ మిగిగిలిన అంశాలను ఆమోదిస్తు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి మంచినీటి పథకాన్ని నిర్మించినా కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదని, నెలనెలా వాటర్ ట్యాంకర్లకు బిల్లులు చెల్లిస్తున్నా శివారు ప్రాంతాలకు తాగునీరు ఎందుకు సరఫరా చేయలేక పోతున్నారో చెప్పాలని కమిషనర్ రవికుమార్‌ను కౌన్సిలర్లు నిలదీశారు. దీనిపై ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ జగనన్న కాలనీ, సూరంపేట వంటి ప్రాంతాలకు నిత్యం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. అనంతరం 15వ వార్డు కౌన్సిలర్ అప్పలస్వామి మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు సరిగా పనిచేయడంలేదని, ఐదు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరగ్గా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుధ్య సమస్య పెరుగుతోందని, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాల అధ్వానంగా ఉన్నాయని వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.